సాక్షి విజయనగరం

సోమవారం ı 18 ı మార్చి ı 2024



'భోజనం' భేష్

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాలకు నాణ్యమైన సరుకులు ప్రభుత్వం సరఫరా చేస్తుంది.


- 8లో



దేవతలారా దీవించండి

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర మహోత్సవం, జామి ఎల్లారమ్మ జాతర ఆదివారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి.

- 8లో



న్యూస్‌రీల్

మడ్డువలస నీటి సరఫరా నిలుపుదల



కుడి ప్రధాన కాలువ

వంగర: రబీ పంటల సాగుకు మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీటి సరఫరా ఆదివారం నిలిపి వేసినట్లు డీఈ అర్జున్ వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 3వ తేదీన రబీ పంటల సాగుకు నీటిని విడుదల చేశారు. వంగర, రేగిడి, సంతకవిటి, జి.సిగడాం మండలాల్లో 13,500 ఎకరాల్లో పంటల సాగు చేశారు. అయితే పంటల సాగుకు సాగునీరు అవసరం లేకపోవడంతో నీటి సరఫరా నిలిపివేశామని ప్రస్తుతం ప్రాజెక్టులో 63 మీటర్లు లెవెల్ నీటి మట్టం ఉందని ఆయన వెల్లడించారు.

వంశధార నదిలో పురాతన విగ్రహాలు



నేరడి బ్యారేజి వద్ద వంశధార నదిలో లభించిన విగ్రహాలు

భామిని: మండలంలోని నేరడి బ్యారేజి వద్ద వంశధార నదిలో పురాతన రాతి విగ్రహాలు, ఆలయం ముందు ఏర్పాటు చేసే బొమ్మలు ఆదివారం బయల్పడ్డాయి. వంశధార ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదిత స్థలంలో ఇవి బయటపడడంతో స్థానికులు ఆసక్తిగా చూస్తున్నారు. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం గణనీయంగా తగ్గిపోవడంతో ఇవి బయల్పడ్డాయి. ఇవి ఎక్కడి నుంచి వచ్చే అవకాశాలు లేవని స్థానికంగానే ఉండి ఉంటాయని స్థానికులు చెబుతున్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు సచిన్



సచిన్

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న బాక్సింగ్ పోటీలకు విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన బి.సచిన్ ఎంపికయ్యాడు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన మూడవ రాష్ట్ర సబ్ జూనియర్ బాల బాలికల పోటీల్లో విజయనగరం క్రీడాకారులు ప్రతిభ కనబరిచగా... బంగారు పతాకం సాధించిన సచిన్ ఈ నెల 18 నుంచి 25 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నోయిడాలో జరగబోయే జాతీయ స్థాయి పోటీ లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచటంతో పాటు జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు సచిన్‌ను బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్, శాప్ కోచ్ బి.ఈశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు రాజు, పిఎల్.ప్రసాద్, బాక్సింగ్ రింగ్ అఫీషియల్స్ వి.సంతోష్ కుమార్, పి.శ్రీనివాసరావు, బి.జగదీష్‌నాయుడు తదితరులు అభినందించారు.

ప్రారంభమైన పోలిపల్లి పైడితల్లి జాతర



పూజలందుకుంటున్న పైడితల్లి అమ్మవారు

రాజాం సిటీ: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. తెల్లవారుజామున ఆలయ మేనేజర్ బీవీ మాధవరావు తొలి పూజ చేసి జాతరను ప్రారంభించారు. ప్రతి ఏటా జరుగుతున్నట్లే పారిశ్రామికవేత్త పొట్టా కల్యాణ్‌చక్రవర్తి పూజలు చేసి హుండీని, చెలికాని బదరీనారాయణ టిక్కెట్ కౌంటర్‌ను ప్రారంభించారు. అమ్మవారికి పసుపు కుంకుమలతో పాటు నూతన వస్త్రాలను డాక్టర్ పీఎల్ఎన్ రాజు (రఘు) అందజేశారు. భక్తులు మొక్కులు చెల్లించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జెయింట్‌వీల్, సర్కస్‌లు, రంగుల రాట్నాలు ఆకట్టుకున్నాయి. జాతరలో ఏర్పాటు చేసిన వివిధ ఆట వస్తువుల షాపులు, గృహోపకరణ అలంకరణ సామగ్రి తదితర షాపులు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాజాం టౌన్, రూరల్ సీఐలు డి.మోహనరావు, ఎస్.శ్రీనివాసరావు, పోలీసులు భద్రతా ఏర్పాట్లు నడుమ మొదటి రోజు జాతర ప్రశాంతంగా జరిగింది.

బొబ్బిలి రాజుల భూకబ్జా





రాజులు స్వాధీనం చేసుకున్న భూమి ఇదే

- గిరిజనులకిచ్చిన భూమిని లాక్కుని ఉద్యోగ హామీ
- ఏళ్లు గడుస్తున్నా అతీగతీ లేని వైనం
- లబోదిబోమంటున్న గిరిజనులు
- తమ భూములు తిరిగి తమకివ్వాలని డిమాండ్

బొబ్బిలి:

ప్రభుత్వం ఇచ్చిన డీ పట్టా భూములను సాగు చేస్తూ బతుకీడ్చే గిరిజనం భూములపై బొబ్బిలి రాజుల కన్నుపడింది. ఇంకేముంది రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవ అన్న చందాన వారిని పలు ప్రలోభాలకు గురిచేసి ఆ భూములను బలవంతంగా లాక్కున్నారు. అయితే రాజులిచ్చిన హామీలేవీ నెరవేర్చకపోవడంతో తాము ఉపాధి లేక అల్లాడుతున్నామని.. ఆ భూమే తమ జీవనాధారమని, తమ భూములను తమకు ఇప్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. గిరిజనులు, బీసీ నిరుపేదలు, కార్మికులు, వ్యవసాయ కూలీలు ఎక్కువగా ఉండే బొబ్బిలి నియోజకవర్గం దశాబ్దాలపాటు బొబ్బిలి రాజుల గుప్పిట్లో ఉండేది. ఆ సమయంలో కనుచూపు మేర ఉండే భూములన్నీ వారి హస్తగతంలో ఉండేవి. అప్పట్లో వచ్చిన భూపరిమితి చట్టం ప్రకారం కొన్ని భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా మరికొన్నింటిని రాజులే స్వయంగా ప్రభుత్వానికి అప్పగించేశారు. క్రమేణా 1992లో అప్పటి ప్రభుత్వం బొబ్బిలి మండలంలోని పుల్లేరువలస గిరిజనులకు బొబ్బిలి, పార్వతీపురం మధ్య గల అంతర్రాష్ట్ర రహదారి పక్కనే ఒక్కొక్కరికీ ఎకరా చొప్పున డీ పట్టా భూములను పంపిణీ చేసింది. ఆ భూములను సాగుచేసుకుంటూ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. అయితే రాను రానూ ఆ భూముల విలువ పెరుగుతుండడంతో బొబ్బిలి రాజులకు మళ్లీ ఆ భూములపై కన్ను పడింది. దీంతో ఆ భూములను సాగుచేసుకుంటున్న గిరిజనులను కోటలోకి రమ్మని పిలిపించారు. ఆ భూములను వదిలి వెళ్లాలని హుకుం జారీ చేశారు. అయితే తమకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని తామే సాగు చేసుకుంటామని వారు సమాధానమిచ్చారు. దీంతో రాజులు తమ కుయుక్తులకు పదును పెట్టారు. అప్పుడు ఆర్.వి.సుజయకృష్ణరంగారావు గనులశాఖ మంత్రిగా ఉన్నారు. మరో పక్క నేటి టీడీపీ అభ్యర్థి బేబీ నాయన, వీరి మేనమామ డీఎస్పీగా పనిచేసి రిటైరైన వ్యక్తి ఈ వ్యవహారంలో చక్రం తిప్పారు. మధ్యవర్తులు, అనుచరులు, బంధుగణంతో కలసి వారిని పలు ప్రలోభాలకు గురిచేశారు. 'మీకు ఆ భూమికి తగ్గట్టుగా వేరే చోట భూమి కొనుగోలు చేసి ఇస్తాం. మీ ఇళ్లలో ఒకరికి ఉద్యోగమిస్తాం' అని నమ్మబలికారు. దీంతో గిరిజనులు రాజుల పేరిట తిరిగి భూములను రాశారు. అయితే రాజుల నుంచి కబురు వస్తుందని ఎదురు చూసిన గిరిజనులకు నిరాశే ఎదురయింది. సంవత్సరాలు గడుస్తున్నా అతీగతీ లేకుండా పోయింది. కాగా, బొబ్బిలిలోని మల్లంపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 247లో ఉన్న భూములు తిరిగి రాజుల పేరున రాయించుకున్నారని, మరికొన్ని ఇప్పటికీ ప్రభుత్వం పేరిటే ఉన్నాయని గిరిజనులు చెబుతున్నారు. తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



భూముల వద్ద తమకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు చూపుతున్న గిరిజనులు

రాజులకు మోసాలు అలవాటే



బొబ్బిలి రాజులకు ఇలాంటి మోసాలు ఓ లెక్క కాదు. గతంలో షుగర్ ఫ్యాక్టరీ రైతులను మోసం చేశారు. అలాగే, జూట్ ఫ్యాక్టరీ కార్మికులను నిలువునా ముంచేశారు. గిరిజనులను మోసం చేయడం వారికి ఏమాత్రం. ఈ మోసాలను బయటకు తీసుకొచ్చి గిరిజనులను ఆదుకుంటాం.

– శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఎమ్మెల్యే, బొబ్బిలి

మా భూమి లాక్కున్నారు..



మాది బొబ్బిలి మండలం పుల్లేరు వలస. 1992లో మాకు ప్రభుత్వం ఎకరా చొప్పున డీ పట్టా భూమి ఇచ్చింది. వాటిని బేబీ నాయన తీసుకున్నారు. అదేమని అడిగితే కోటలోకి పిలిపించారు. వేరే చోట భూమి ఇస్తామన్నారు. అలాగే ఇంటికో ఉద్యోగం ఇస్తామన్నారు. నేటికీ అతీగతీ లేదు.

– ముంగి నర్సింహులు, గిరిజన రైతు

పేదలపై రాజుల ప్రతాపం



బొబ్బిలి రాజులైన ఆర్.వి.సుజయకృష్ణరంగారావు మంత్రిగా కొన్నాళ్లు చేసినప్పుడే మా భూములు తీసుకుని భూములు వేరే చోట ఇస్తామన్నారు. ఇప్పుడు మాకు భూమి లేదు. ఉపాధి లేదు. ఏ పనులు లేక వీధిన పడ్డాం. మా భూములు మాకు ఇప్పించి మమ్మల్ని ఆదుకోవాలి.

– చల్ల శంకరరావు, పుల్లేరు వలస

రాజులకు ఇదేం బుద్ధి



ఇన్నాళ్లూ భూమి బదులు భూమి, ఇంటికో ఉద్యోగం ఇస్తామని నమ్మబలికారు. ఇప్పుడు మధ్యవర్తులూ పికర లేదు. మా భూములు మాకివ్వలేదు. కుర్రాళ్లకు ఉద్యోగాలిస్తామన్న రాజులు పత్తా లేకుండా పోయారు ఇదేం రాజనీతి. మా భూములు మమ్మల్ని సాగు చేసుకోనివ్వాలి.

– చల్ల కృష్ణ, పుల్లేరువలస

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 23 వరకు పరీక్షలు
- విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం
- 27,178 మందికి 129 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షల సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబరు : 90009 45346
- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తమ కార్యాలయంలో మీడియా సమావేశంలో వెల్లడించారు. సోమవారం నుంచి ఈ నెల 23 వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో 129 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో మొత్తం 27,178 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. వీరిలో 23,828 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా 3,350 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, ప్రాథమిక చికిత్స తదితర ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష ప్రారంభమైన సమయం నుంచి అరగంట వరకు అంటే ఉదయం 10 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారని చెప్పారు. తర్వాత అభ్యర్థులెవరినీ లోనికి అనుమతించరని స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు తగినన్ని ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని, హాల్ టిక్కెట్ చూపినట్లయితే బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతిస్తారని చెప్పారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి తప్పనిసరిగా హాల్ టికెట్ తీసుకువెళ్లాల్సి ఉంటుందని లేకుంటే పరీక్షలు రాసేందుకు అనుమతించరని చెప్పారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించనున్నట్లు చెప్పారు. ప్రశ్నపత్రాలు బయటకు పంపే వీలు లేకుండా అన్ని ప్రశ్న పత్రాలకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశామని, ఎక్కడి నుంచి బయటకు వెళ్లింది సులువుగా తెలుసుకోగలమన్నారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించిన సమాచారాన్ని తెలిపే నిమిత్తం డీఈఓ కార్యాలయంలో 9000945346 మొబైల్ నంబరుతో ఒక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని, కార్యాలయ వేళల్లో ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

'గురుదేవా'లో రూ 2.50కోట్లతో కేన్సర్ ఆస్పత్రి

- గురుదేవాలో దివ్యాంగులకు అందుతున్న సేవలు అమోఘం
- ప్రవాన భారతీయుడు ఉప్పలపాటి రాజు



గురుదేవా ఆధ్వర్యంలో తయారు చేస్తున్న కృత్రిమ అవయవ తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న ప్రవాస భారతీయుడు ఉప్పలపాటి రాజు

కొత్తవలస : మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలో గల శ్రీగురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆవరణలో రూ 2.50 కోట్లతో వంద పడకల కేన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన జరిగింది. ప్రవాస భారతీయుడు యూఎస్‌ఏకు చెందిన ఉప్పలపాటి ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో దీన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఉప్పలపాటి రాజు ఆదివారం ట్రస్టును సందర్శించి ట్రస్టు ద్వారా ప్రస్తుతం అందుతున్న సేవలను, కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజు మాట్లాడుతూ తన భార్య డాక్టర్ విజయ కేన్సర్ వ్యాధితో బాధపడుతూ సరైన వైద్యం అందక మృతి చెందారని గుర్తు చేశారు. దీంతో ఆమె జ్ఞాపకార్థం స్వదేశంలో ఉచిత కేన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేసేందుకు సంకల్పించానని తెలిపారు. గురుదేవా ట్రస్టు చేస్తున్న సేవలను తెలుసుకొని తద్వారా తన సంకల్పం నెరవేర్చుకోవచ్చని తెలిసి ఇక్కడ రూ. 2.50కోట్లతో కేన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి ముందుకు వచ్చానని తెలిపారు. ప్రస్తుతం గురుదేవా ట్రస్టు ద్వారా దివ్యాంగులకు, అభాగ్యులకు అందుతున్న సేవలు అభినందనీయమన్నారు. తన జీవితాన్నే దివ్యాంగుల సేవలకు అంకితం చేసిన ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఆదర్శప్రాయుడని కొనియాడారు. ముందుగా 20 మంది దివ్యాంగులకు ఉచిత కృత్రిమ కాళ్లు, చేతులు, బ్లైండ్ స్టిక్స్, వినికిడి యంత్రాలు అందజేశారు. 50 మంది వృద్ధులకు బియ్యం పంపిణీ చేశారు. 60 మంది పసిపిల్లలకు జాన్సన్ బేబీ కిట్స్, ఫీడింగ్ బాటిల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు, ట్రస్టు వైస్ చైర్మన్ డాక్టర ఫణికుమార్ పాల్గొన్నారు.

డీఎస్సీ వాయిదా కోసం వినతులు

విజయనగరం అర్బన్: ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరణ కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కి తొలి రోజున టీచర్ పోస్టుల నియామక ప్రక్రియ షెడ్యూల్‌పై అభ్యర్థుల నుంచి వినతులు వెల్లువెత్తాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ప్రస్తుత పరీక్షల తేదీ అనుకూలంగా లేదని వినతుల్లో పేర్కొన్నారు. ప్రిపరేషన్‌కి కేంద్రీకరించలేకపోతున్నామని, వాయిదా వేయాలని కోరారు. ఆదివారానికి 40 మంది అభ్యర్థులు వివిధ మాధ్యమాల ద్వారా కంట్రోల్ రూమ్‌కి వినతులు పంపారని కంట్రోల్ నిర్వాహకులు పేర్కొన్నారు.

భవిష్యత్తుపై ప్రభావం చూపే తప్పిదాలు చేయొద్దు

- పదో తరగతి రాష్ట్ర పరిశీలకుడు సుబ్బారావు



పది పరీక్షల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర పరిశీలకుడు సుబ్బారావు

విజయనగరం అర్బన్: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థికి ప్రశాంత వాతావరణ కల్పిస్తూ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పరీక్షల నిర్వహణ జరగాలని రాష్ట్ర పరిశీలకుడు వి.ఎస్.సుబ్బారావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా పట్టణానికి వచ్చిన ఆయన స్థానిక డీఈఓ కార్యాలయంలో పది పరీక్షల స్క్వాడ్‌లతో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షల నిర్వహణపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి భవిష్యత్తుపై ప్రభావం చూపే తప్పిదాలు జరగనీయకుండా పర్యవేక్షణ చేపట్టాలని, ఆ దిశగా సిబ్బంది పని చేయాలని ఆయన సూచించారు. అనంతరం పట్టణంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో కనీస సౌకర్యాలు, తరగతి గది పరిసరాలను తనిఖీ చేశారు. ఆయన వెంట డీఈఓ ఎన్.ప్రేమకుమార్, డీసీఈబీ సెక్రటరీ టి.సన్యాసిరాజు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష

విజయనగరం అర్బన్: జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్ – 1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 14 పరీక్ష కేంద్రాలలో 6,568 మందికిగాను పరీక్షకు 61.46 శాతం మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 4,069 మంది హాజరు కాగా, మధ్యాహ్నం పూట పరీక్షకు 4,037 మంది మాత్రమే హాజరయ్యారు. వివిధ పరీక్ష కేంద్రాలను జేసీ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ఏపీపీఎస్‌సీ అధికారులు పర్యవేక్షించారు.

భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ

విజయనగరం క్రైమ్: జిల్లాలో గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ ఎం.దీపిక స్వీయ పర్యవేక్షణ చేశారు. గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా చర్యలను పరిశీలించారు. ఆమె వెంట విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, టూటౌన్ సీఐ కె.రామారావు తదితరులు ఉన్నారు.



సీతం ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ ఎం.దీపిక



పరీక్ష కేంద్రం వద్ద క్యూలైన్లో అభ్యర్థులు

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎలక్షన్ కంట్రోల్ రూమ్ ప్రారంభం
- ఫిర్యాదులు, సమస్యల స్వీకరణకు ఆరు విభాగాలు
- సమస్యల పరిష్కారానికి 100 నిమిషాల్లో చర్యలు
- నివేదికల నమోదు పక్కాగా పంపాలి : కలెక్టర్



కంట్రోల్ రూమ్‌లోని మోనటరింగ్ విభాగాల పనితీరును పరిశీలిస్తున్న, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ కె.కార్తీక్

విజయనగరం అర్బన్:

సార్వత్రిక ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని జిల్లా యంత్రాంగం చేస్తున్న చర్యలు ఓ కొలిక్కి వస్తున్నాయి. ఇప్పటికే మండల, జిల్లా స్థాయి అధికారులకు శిక్షణ పూర్తి చేశారు. డివిజన్ స్థాయి రిటర్నింగ్ అధికారులతో పాటు మొత్తం ఎన్నికల నిర్వహణ నుంచి కౌంటింగ్ వరకు మోనటరింగ్ కోసం 16 భాగాలుగా విభజించి ఒక్కో విభాగానికి ఒక జిల్లా అధికారిని నోడల్ అధికారిగా వ్యవహరించాలని బాధ్యతలను అప్పగించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతుల స్వీకరణ, క్షేత్ర స్థాయి నుంచి ఉన్నతాధికారులకు సమాచారం, నివేదికల రాకపోకల కోసం స్థానిక కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఐదు రకాల మాధ్యమాల ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను స్వీకరించడానికి ఐదు విభాగాలను సిద్ధం చేశారు. ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా, సోషల్ మీడియా సెల్, 24/7 కాల్ సెంటర్, కంప్లెంటింగ్ మానిటరింగ్ సెల్, రిపోర్ట్ మేనేజిమెంట్ సిస్టం విభాగాలు పని చేస్తాయి. మోడల్ కోడ్ ఉల్లంఘనపై మెయిల్స్‌లో, సోషల్ మీడియాలో, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలలో వచ్చే ఫిర్యాదులను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు వెంటనే ఈ కంట్రోల్ రూమ్ వ్యవస్థ ద్వారా పంపిస్తారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో క్షేత్ర స్థాయిలో విచారించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఫిర్యాదుదారు వారి పేరు, ఫోన్ నెంబర్ నమోదు చేసి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదుల కోసం 24/7 పని చేసే 1950 టోల్ ఫ్రీ నెంబర్ పని చేస్తోంది. అదే విధంగా కంట్రోల్ రూమ్‌లోని ల్యాండ్ లైన్ 08922-797120, 08922-797124 ఫోన్ నెంబర్ నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు. జిల్లాలో తొలిసారిగా ఈ విధమైన వ్యవస్థను కలెక్టర్ నాగలక్ష్మి రూపకల్పన చేశారు.



కంప్యూటర్లలో సమాచారాన్ని, పరిశీలిస్తున్న కలెక్టర్

నివేదికలు పక్కాగా పంపాలి : కలెక్టర్

జిల్లాలోని క్షేత్ర స్థాయి నుంచి ఎన్నికల ప్రక్రియకు సంబంధించి వస్తున్న నివేదికలను పక్కాగా నమోదు చేసి ఎప్పటికప్పుడు వేగంగా పంపాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ఆదివారం ఆమె తనిఖీ చేశారు. కంట్రోల్ రూంలోని వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు. ఏ ఫిర్యాదైనా 100 నిమిషాల్లో పరిష్కార ప్రక్రియ జరిగే విధంగా ఈ వ్యవస్థ పనిచేయాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ నిర్వాహకులు సీపీఓ పి.బాలాజీకు సూచనలిచ్చారు. సోమవారం నుంచి పూర్తి సిబ్బందితో పని చేయాలని, అందుకు తగ్గ కంప్యూటర్లు, టీవీలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఆమెతో పాటు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బి.సహాదిత్ వెంకట త్రివినాగ్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, సీపీఓ పి.బాలాజీ, జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, డీపీఓ శ్రీధర్ రాజు, డీపీఆర్‌ఓ డి.రమేష్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వెంకట నరేంద్రకు 'గేట్'లో 724వ ర్యాంక్



విజయనగరం అర్బన్: పబ్లిక్ సెక్టార్‌లో ఉన్నతస్థాయి ఉద్యోగాలకు, ప్రతిష్ఠాత్మకక ఇంజినీరింగ్ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు చేపట్టే 'గేట్' పోటీ పరీక్షలో విజయనగరం పట్టణానికి చెందిన కొట్యాడ వెంకట నరేంద్ర 724వ ర్యాంక్ సాధించాడు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో 620 స్కోర్ తెచ్చుకోవడంతో ఈ ర్యాంక్ లభించిందని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. రాష్ట్రంలోని ఎన్ఐటీలో మూడో సంవత్సర ఇంజినీరింగ్ చదువుతున్న వెంకట ప్రసాద్ పట్టణంలోని కేంద్రీయ విద్యాయలంలో ఇంటర్మీడియట్ చదివాడు. తండ్రి వెంకట ప్రసాద్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తల్లి గంగలక్ష్మి గృహిణి. తొలి ప్రయత్నంలోనే మంచి ర్యాంక్ తెచ్చుకున్నందుకు పలువురు అభినందనలు తెలిపారు.

అలరించిన ఉత్తరాంధ్ర స్థాయి నాటిక పోటీలు



పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న హరిబాబు

రాజాం సిటీ: అంతరించిపోతున్న కళారంగాన్ని బతికించుకునేందుకు కళాకారులు పడుతున్న తపన ఎనలేనిదని గ్రంధి హరిబాబు అన్నారు. రాజాం పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఎస్‌వీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఉత్తరాంధ్రస్థాయి ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వెండితెర, బుల్లితెరల ప్రభావంతో నాటకరంగం అంతరించి పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీన్ని బతికించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. మంచి నాటకాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుందన్నారు. అనంతరం ప్రదర్శించిన ఏకపాత్రాభినయ పోటీలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో కళాపరిషత్ అధ్యక్షుడు సలాది తుల సీదాస్,ఆర్నిపల్లి వెంకటినాయుడు, మక్క అప్పలనాయుడు, పెంకి గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారా ధ్వంసం

పార్వతీపురం టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన సారాను ఏఎస్పీ సునీల్ షరోన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ గతంలో స్వాధీనం చేసుకున్న 18 సారా కేసుల్లో ఉన్న 1502 లీటర్ల సారాను ధ్వంసం చేశామన్నారు. సారా రవాణా, అమ్మకాలు, తయారీ వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ పీవీవీఎస్ఎన్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



బొండపల్లి: మృతి చెందిన దేవుడు



బొబ్బిలి: పార్వతి మృతదేహం

బొండపల్లి/ చీపురుపల్లి రూరల్(గరివిడి), బొబ్బిలి: విజయనగరం జిల్లాలో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. ఆయా ప్రమాదాలకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నెలిమర్లలోని రామతీర్థం జంక్షన్‌కు చెందిన ఆటో డ్రైవర్ యాండ్రాపు దేవుడు (36) బొండపల్లి మండలంలోని నెలివాడ సమీపంలో రాజు చెరువులో చేపలు తీసుకుని స్వగ్రామం వెళ్లిపోతుండగా నెలివాడ జాతీయ రహదారి26పై పార్వతీపురం నుంచి విజయనగరం వెళ్తున్న కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ దేవుడుని 108 వాహనంలో విజయనగరం లోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. అదే ఆటోలో ప్రయాణిస్తున్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా సర్వజన ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మృతునికి భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మరో ప్రమాదంలో శ్రీకాకుళం రైల్వే రోడ్డు పరిధిలో గరివిడి-నెల్లిమర్ల మధ్యలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మూడు రోజుల క్రితం ఈ ప్రమాదం జరిగి ఉంటుందని నిద్రమత్తులో రైలు నుంచి జారిపడి ఉండొచ్చనని రైల్వే పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుని వయస్సు 50 సంవత్సరాలు ఉండొచ్చని తెలిపారు. వివరాల కోసం ఫోన్9491106219 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అలాగే బొబ్బిలి పట్టణంలోని పట్టణంలోని ఫూల్‌భాగ్ రోడ్డులో నడిచి వెళ్తున్న మహిళను వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మృతి చెందింది. మృతురాలిని బొబ్బిలిలోని గొల్లవీధికి చెందిన కొల్లి పార్వతి(54)గా గుర్తించారు. మృతురాలికి నలుగురు వివాహితులైన పిల్లలు ఉన్నారు. ఆమె భర్త ఐదేళ్ల కిందట మృతిచెందాడు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204

దేవతలారా దీవించండి

- వైభవంగా కనకమహాలక్ష్మి, ఎల్లారమ్మ జాతరల ప్రారంభం
- తెల్లవారుజామున 2 గంటల నుంచే ప్రారంభమైన దర్శనాలు
- మధ్యాహ్నం 12 గంటల వరకు బారులు తీరిన భక్తులు
- పసుపు, కుంకుమలతో మొక్కుల చెల్లింపు
- చీపురుపల్లిలో దర్శించుకున్న జెడ్పీచైర్మన్, ఎంపీ



జామి: అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



జామి: లక్ష్మీ స్వరూపిణిగా దర్శనమిచ్చిన యల్లారమ్మ అమ్మవారు



జామి: అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



చీపురుపల్లి: పూజలు అందుకుంటున్న శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పుష్పాంజలి దంపతులు



అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ దంపతులు

చీపురుపల్లి/జామి: భక్తుల కొంగు బంగారం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర మహోత్సవం, జామి మండల కేంద్రంలో ఎల్లారమ్మ జాతర ఆదివారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ కనకమహాలక్ష్మి, ఎల్లారమ్మా.. కరుణించండంటూ భక్తుల నామస్మరణతో ఆ రెండు ఆలయాలు మార్మోగిపోయాయి. ఏటా మహాశివరాత్రి తరువాత జరిగే శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర కోసం వేచి ఉన్న భక్తులు జాతర ప్రారంభమవడంతో ఆడపిల్లలు, బంధువులను పిలిచి పండగ జరుపుకున్నారు. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 26వజాతర మహోత్సవాల సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాశ్(గోవింద్), వైస్ చైర్మన్ సూరు కుమార్‌లు దంపతులతో సహా తొలిపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు దర్శనం చేసుకున్నారు. తెల్లవారుజామున 2 గంటలకు ప్రారంభమైన దర్శనాలు మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగాయి. అమ్మవారి దర్శనం కోసం దేవాదాయశాఖ రూ.100, రూ.50, రూ.20 టిక్కెట్ల క్యూలు ఏర్పాటు చేసింది. వీటితో పాటు ఉచిత దర్శనాలు కూడా కల్పించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలతో పాటు కోళ్లు, మేకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతేకాకుండా ప్రత్యేక మొక్కులు ఉన్న వారు ప్రభలు కట్టి మోసుకుంటూ అమ్మవారి దేవస్థానానికి చేరుకుని దర్శనం చేసుకున్నారు. మహిళా భక్తులు రావిచెట్టు, ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించారు. జాతర ప్రారంభం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి పర్యవేక్షణలలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..

ఇదిలా ఉండగా శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పుష్పాంజలి దంపతులతో పాటు వారి కుమార్తె సిరిసహస్ర, కుమారుడు మోహిత్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శ్రీదేవి దంపతులతో పాటు కుమారుడు వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, పావని దంపతులు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎల్లారమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే కడుబండి

ఎల్లారమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి కరుణాకటాక్షాలు ఎస్.కోట నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ప్రార్థించారు. జాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు.జాతరలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది చర్యలు చేపట్టారు.

సచివాలయ ఉద్యోగి మృతి

- ఆదుకోవాలని కలెక్టర్‌కు డిప్యూటీ సీఎం ఆదేశం

దేవరాపల్లి: అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామ సచివాలయం పరిధి ములకలాపల్లిలో ఆదివారం ఉదయం విద్యుత్ ఘాతానికి గురై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ డెక్క చిరంజీవి (34) మృతిచెందాడు. ఎన్నికల విధుల్లో భాగంగా ఫ్లెక్సీలు తొలగిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఆ రెండు గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. విజయనగరం జిల్లా వేపాడ మండలం కుమ్మపల్లి గ్రామానికి చెందిన చిరంజీవి మృతితో కుటుంబసభ్యులు తీవ్ర దుఃఖసాగరంలో మునిగిపోయారు. మృతుడికి తల్లి కృష్ణమ్మతోపాటు భార్య హేమలత, పిల్లలు చేతన్(6), ఇషాన్(3) ఉన్నారు. మృతుడి తండ్రి పదేళ్ల క్రితం మరణించగా, తల్లి అనారోగ్యంతో మంచానపడ్డారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న చిరంజీవి మృతితో తమకు దిక్కెవరంటూ భార్య రోదించిన తీరు పలువురి హృదయాలను కలిచివేసింది. డ్యూటీకి వెళ్లి వస్తానని చెప్పి తిరిగిరాని లోకాలకు వెళ్లి పోయావా, ఇప్పుడు పిల్లలను ఎలా పోషించాలంటూ విలపించడం పలువుర్ని కంటతడి పెట్టించింది. మండలంలోని సచివాలయ ఉద్యోగులతోపాటు ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.నాగేంద్ర తెలిపారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి తరలించారు. డిప్యూటీ సీఎం పరామర్శ వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి విషయాన్ని తెలుసుకున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. చిరంజీవి మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రమాదం తీరును కొత్తపెంట సర్పంచ్ రొంగలి వెంకటరావు, గొర్లి కొండలరావు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మిలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కలెక్టర్ రవిపట్టన్ శెట్టిని ఫోన్‌లో కోరారు.

వైశ్యులంటే అపారమైన గౌరవం

- ఎల్లప్పుడూ అండగా ఉంటాం
- ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బొత్స



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, వేదికపై ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు తదితరులు

గజపతినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్యవైశ్యులకు పలు రకాలైన పదవులు ఇచ్చి వారికి ప్రత్యేకమైన ప్రాధాన్యం కల్పించారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యలు అన్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి గజపతినగరం మండల కేంద్రంలోని వాసవి కల్యాణ మంటపంలో నిర్వహించిన మండలస్థాయి ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో గజపతినగరంలో ఏఒక్క ఆర్యవైశ్యునికి ఎటువంటి సమస్య రాకుండా చూసుకున్నామని, అదేవిధంగా మళ్లీ తాము అధికారంలోకి వచ్చిన తరువాత గజపతినగరం, పురిటి పెంట మేజర్ పంచాయతీలను అభివృద్ధి స్థాయి జంట నగరాలుగా తీర్చి దిద్ది ప్రజల మన్ననలను పొందుతామని చెప్పారు. ఏ ఒక్క మంచి కార్యక్రమం తలపెట్టినా ఆర్యవైశ్యులతో మొదలుపెట్టడం అలవాటుగా వస్తోందని, ఆ దిశగా ఈరోజు ఈరకంగా ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో కలవడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. అలాగే గజపతినగరంలో కల్యాణ మంటపం కోసం స్థల సేకరణ, శ్మశాన వాటిక, మరుగుదొడ్లు, తదితర అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి అన్నిరకాలుగా ఆదుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు (సురేష్ బాబు) జెడ్పీటీసీ గారతవుడు, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి శంకరరావు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పూసర్ల మోహన్, కె.సాంబమూర్తి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కె.ఆదినారాయణ, పి.నారాయణ మూర్తి, కె.రామునాయుడులతో పాటు స్థానిక ఆర్యవైశ్య పెద్దలు పాల్గొన్నారు.

'భోజనం' భేష్

- ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం
- మినరల్ వాటర్
- విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం
- 20 వేల మంది గిరిజన విద్యార్థులకు ప్రయోజనం



బాలికల ఆశ్రమ పాఠశాలలో మినరల్ వాటర్ సదుపాయం



సీతంపేట బాలుర ఆశ్రమ పాఠశాలలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాలకు నాణ్యమైన సరుకులు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. విద్యార్థులకు వండి వడ్డించడానికి బ్రాండెడ్ సరుకులను సప్లై చేస్తున్నారు. పామాయిల్ స్థానంలో సన్‌ఫ్లవర్ ఆయిల్, అకోలా కంపెనీకి చెందిన కందిపప్పు, త్రిబుల్ హార్స్ మినపగుళ్లు, బన్సీ రవ్వ, ఇడ్లీ నూక, గోధుమ పిండి తదితర నాణ్యమైన సరుకులు అందిస్తున్నారు. వసతిగృహాల్లో ఉంటూ చదువుకునే విద్యార్థులు మంచిగా చదువుతూ.. ఆరోగ్యంగా ఉండేందుకు వీలుగా రోజూ నాణ్యమైన మెనూ అందించేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రతీ మూడు నెలలకు జీసీసీ ఆధ్వర్యంలో సరుకుల సరఫరాకు టెండర్లు సైతం నిర్వహిస్తున్నారు. సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 47 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, మరో 23 రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, 32 పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయి. దాదాపు వీటిలో 20 వేల మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు.

నిధుల కేటాయింపు ఇలా...		
తరగతి	గతంలో కేటాయింపు	ప్రస్తుతం కేటాయింపు
3 నుంచి 4	రూ.1000	రూ.1150
5 నుంచి 10	రూ.1250	రూ.1450
ఇంటర్మీడియెట్ ఆపైన	రూ.1400	రూ.1600

పక్కాగా అమలుకు చర్యలు



మెనూ పక్కాగా అమలుకు చేయడం జరుగుతుంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. గతంతో పోలిస్తే డైట్ చార్జీలు పెంచడంతో పోషకాహారంతో కూడిన మెనూ విద్యార్థులకు అందజేస్తున్నాం. అదనంగా చిక్కీలు, పండ్లు వంటివి ఇస్తున్నాం.

– అన్నదొర, గిరిజన సంక్షేమశాఖ డీడీ, సీతంపేట

రుచికరమైన భోజనం



అన్ని విధాల చదువుకోవడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సౌకర్యాలు కల్పిస్తున్నారు. మంచి మెనూ అందిస్తున్నారు. ఇదివరకటి కంటే ఇప్పుడు పెంచిన నిధులతో ఇంకా రుచికరమైన భోజనం పెడుతున్నారు.

– పి.లక్ష్మి, 9 వతరగతి, బాలికల ఆశ్రమ పాఠశాల, సీతంపేట

కార్పొరేట్ తరహా విద్య



గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్యను అందించడం జరుగుతుంది. నాడు – నేడు పనులతో పాఠశాలల రూపురేఖలు మారాయి. వాటితో పాటు సరైన మెనూ అందిస్తున్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం జరుగుతుంది. గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో జగనన్న ఆణిముత్యాలు కూడా దోనుబాయి విద్యార్థికి వచ్చింది.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

మెనూ ఇలా...

- **ఆదివారం:** అల్పాహారం: పూరి, బంగాళాదుంప, బఠాణి కుర్మ, ఉడకబెట్టిన కోడిగుడ్డు
  మధ్యాహ్నం: చికెన్ బిర్యాని, పెరుగుపచ్చడి, గోంగూర చట్నీ
  సాయంత్రం: సేమ్యా పాయసం, అరటిపండు
  రాత్రి: అన్నం, సాంబార్, క్యారెట్ పెసరపప్పు కూర, బటర్ మిల్క్
- **సోమవారం:** అల్పాహారం: పులిహోరా, రోస్టెడ్ బెంగాల్ గ్రామ్ డాల్‌పౌడర్, ఉడకబెట్టిన కోడిగుడ్డు
  మధ్యాహ్నం: అన్నం గోంగూర పప్పు, కాయగూర, పెరుగు
  సాయంత్రం: ఉడకబెట్టిన గుగ్గిళ్లు, జామ/స్థానికంగా లభించే పండు
  రాత్రి: అన్నం, క్యాబేజికూర, రసం, మజ్జిగ
- **మంగళవారం:** అల్పాహారం: ఇడ్లి, వేరుశనగ చట్నీ, ఉడకబెట్టిన కోడిగుడ్డు
  మధ్యాహ్నం: అన్నం, పాలకూర పప్పు, కాయగూర, పెరుగు
  సాయంత్రం: రాగి లడ్డు, అరటిపండు
  రాత్రి: బగారా రైస్, చికెన్ కర్రి, గోంగూర చట్నీ, పెరుగుపచ్చడి
- **బుధవారం:** అల్పాహారం: జీరా రైస్, కాయగూర, ఉడికించిన కోడిగుడ్డు
  మధ్యాహ్నం: అన్నం, వంకాయకూర, మెంతికూర పప్పు, పెరుగు
  సాయంత్రం: ఉడకబెట్టిన బొబ్బర్లు, జామ/లోకల్ ఫ్రూట్
  రాత్రి: అన్నం, బెండకాయ, సాంబారు, మజ్జిగ
- **గురువారం:** అల్పాహారం: బస్మతి రవ్వ ఉప్మా, వేరుశనగ చట్నీ, ఉడకబెట్టిన కోడిగుడ్డు
  మధ్యాహ్నం: అన్నం, పాలకూరపప్పు, కాయగూర, పెరుగు
  సాయంత్రం: మరమరాల మిక్సర్, అరటి పండు
  రాత్రి: అన్నం, చిక్కుడుకాయ వేపుడు, సాంబార్, మజ్జిగ
- **శుక్రవారం:** అల్పాహారం: హాట్ పంగల్, డాల్ పప్పు చట్నీ, ఉడకబెట్టిన కోడిగుడ్డు
  మధ్యాహ్నం: అన్నం, మెంతికూర పప్పు, బంగాళదుంప, పెరుగు
  సాయంత్రం: ఉడకబెట్టిన శనగలు, జామ/లోకల్ ఫ్రూట్
  రాత్రి: అన్నం, గుత్తివంకాయ కూర, మజ్జిగ
- **శనివారం:** అల్పాహారం: ఇడ్లీ, వేరుశనగ చట్నీ
  మధ్యాహ్నం: అన్నం, పాలకూర పప్పు, క్యాబేజీ కూర, పెరుగు
  సాయంత్రం: రవ్వ కేసరి, అరటి పండు
  రాత్రి: అన్నం, దొండకాయ కూర, సాంబార్, బట్టర్ మిల్క్,
- ఆదివారం తప్ప మిగతా రోజుల్లో ఉదయం పాలు, ఉదయం విశ్రాంతి సమయంలో స్నాక్స్ కింద మల్టీమిల్లెట్ చక్కీలు ఇవ్వాలి.

లాభాల బాటలో ఏఎంసీలు

- లక్ష్యానికి మించి సమకూరుతున్న ఆదాయం
- ప్రభుత్వ నిర్దేశిత ఆదాయ లక్ష్యం రూ.12.85 కోట్లు
- ఇప్పటివరకు సమకూరిన ఆదాయం రూ. 6.56 కోట్లు
- సివిల్ సప్లయి ద్వారా రావాల్సింది రూ.5.50 కోట్లు
- గతేడాది ఇదే సమయానికి రూ.5.35 కోట్ల రాబడి
- గతేడాదితో పోలిస్తే రూ.1.21 కోట్లు అధికం

విజయనగరం ఫోర్ట్: వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)లు లాభాల్లో బాటలో పయనిస్తున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యం కన్నా అదనంగానే ఆదాయాన్ని సంపాదిస్తున్నాయి. గతంలో వీటి ద్వారా వచ్చే ఆదాయం అంతంత మాత్రంగానే ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏఎంసీల బలోపేతానికి చర్యలు తీసుకోవడంతో సత్ఫలితాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం సంపాదించగలగడమే కాకుండా లక్ష్యానికి మించి ఆదాయం సాధిస్తుండడం విశేషం.

జిల్లాలో 8 ఏఎంసీలు..

జిల్లాలో మొత్తం 8 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఇవి విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, రాజాం, పూసపాటిరేగ, కొత్తవలస, చీపురుపల్లి, మెరకముడిదాం ప్రాంతాల్లో ఉన్నాయి. వీటి పరిధిలో 12 వ్యవసాయ చెక్‌పోస్టులు ఉన్నాయి.

ఆదాయ లక్ష్యం రూ.10 కోట్లు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న 8 ఏఎంసీలు ఇప్పటివరకు రూ.6.56 కోట్ల ఆదాయాన్ని సాధించాయి. ప్రభుత్వ నిర్దేశిత ఆదాయ లక్ష్యం రూ.12.85 కోట్లు కాగా సివిల్ సప్లయి ద్వారా కమీషన్‌ల రూపంలో రూ.5.50 కోట్లు రావాల్సి ఉంది. ఈ ఆదాయం కూడా ఈ నెలఖారులోగా రానుంది. దీంతో శత శాతం లక్ష్యం చేరుకున్నట్లు అవుతుంది. గతేడాది ఇదే సమయానికి రూ.5.35 కోట్లు ఆదాయాన్ని సాధించగా, గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.1.21 కోట్లు అధికంగా ఆదాయం వచ్చింది.

ఆదాయం ఎలా వస్తుంది..

వ్యవసాయ చెక్‌పోస్టులు, గోదాములు, వ్యాపార లావాదేవీల ద్వారా ఏఎంసీలకు ఆదాయం వస్తుంది. వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తులు, ఇతర సామగ్రిని తరలించే వాహనాల నుంచి వ్యవసాయ చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది రుసుం వసూలు చేస్తారు. అలాగే ఏఎంసీల్లో ఉన్న షాపులు నుంచి సెస్(పన్ను)లు, వ్యాపార లావాదేవీలు, గోదాముల అద్దె ద్వారా ఏఎంసీలకు ఆదాయం సమకూరుతుంది.

ఏఎంసీల సిబ్బంది పనితీరు భేష్..



ఏఎంసీల సిబ్బంది పనితీరు భేష్‌గా ఉంది. వారి పనితనం వల్లే లక్ష్యానికి మించిన ఆదాయం వస్తోంది. ఇప్పటివరకు రూ.5.56 కోట్ల ఆదాయం వచ్చింది. సివిల్ సప్లయి ద్వారా కమీషన్‌ల రూపేన మిగతా ఆదాయం రావాల్సి ఉంది. ఏఎంసీలకు వచ్చే ఆదాయ వనరులను సృష్టిస్తున్నాం.

– రవికిరణ్, ఏడీ, మార్కెటింగ్ శాఖ.